సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



ఉక్కుకు రాజభాష పురస్కారం

విశాఖ స్టీల్‌ప్లాంట్ జాతీయ స్థాయిలో ఉత్తమ రాజభాష కీర్తి (ప్రథమ బహుమతి)ని అందుకుంది.

IIలో



పట్టుదలతో కృషి చేస్తే..

పట్టుదలతో కృషి చేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ విజయ కృష్ణన్(ఐఏఎస్) అన్నారు.

IIలో



బాండ్ రూపంలో అమ్మ బంగారం

కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన బంగారు ఆభరణాలను గోల్డ్ బాండ్ రూపంలో డిపాజిట్ చేశారు.

IIలో

న్యూస్‌రీల్

నేడు విశాఖకు సీఎం వైఎస్ జగన్ రాక

ఎయిర్‌పోర్టులో ట్రాన్సిట్ హాల్ట్



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విశాఖ వస్తున్నారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా గన్నవరంలో బయలుదేరి ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా ద్వారపూడికి వెళ్తారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొని.. తిరిగి మధ్యాహ్నం 2.05 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి గన్నవరం బయలుదేరుతారు.

అందుబాటులోకి బీచ్ క్లీనింగ్ మెషీన్లు



సేవలకు సిద్ధంగా బీచ్ క్లీనింగ్ యంత్రాలు

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను జల్లెడ పట్టి.. తొలగించేందుకు జీవీఎంసీ బీచ్ క్లీనింగ్ యంత్రాలు కొనుగోలు చేసింది. గురువారం ఆర్.కె.బీచ్‌కు ఆరు యంత్రాలు చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఈ యంత్రాలు తమ పనిని మొదలుపెట్టనున్నాయి.

ఏయూ గ్రంథాలయానికి ఐఎస్‌వో గుర్తింపు



గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న రెక్టార్ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్ సాధించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆలపాటి శివయ్య ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమతకు ఇటీవల అందజేశారు. ఈ గుర్తింపుపై వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ మేనేజ్‌మెంట్ లీడ్ ఆడిటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఏయూ గౌరవ గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ఏక్సెస్ 2కె23 సదస్సు ప్రారంభం

ఏయూక్యాంపస్: ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏక్సెస్ 2కె23 పేరిట శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఏటా ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సులో భాగంగా పేపర్ ప్రజెంటేషన్, మోడల్స్ తయారీ, క్విజ్, పోస్టర్ తయారీ ఉంటుందన్నారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

23 నుంచి డీఆర్‌ఎం కప్ స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ ఈ నెల 23, 24వ తేదీల్లో జరగనుంది. ఈకోర్స్టా వాల్తేర్ ఆధ్వర్యంలో రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో 50 మీటర్ల ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్, బటర్ ఫ్లై అంశాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తారు. 6-7 ఏళ్ల వారికి ఓ గ్రూప్‌లో, 18+ ఏళ్ల వారికి మరో గ్రూప్‌లో పోటీలు నిర్వహిస్తుండగా.. 8 నుంచి 18 ఏళ్లలోపు వారికి మరో నాలుగు గ్రూప్‌ల్లో పోటీలు జరగనున్నాయి. కాగా.. ఈ చాంపియన్‌షిప్ పోస్టర్‌ను గురువారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ విడుదల చేశారు. ఏడీఆర్‌ఎం మనోజ్ కుమార్, క్రీడాధికారి ప్రవీణ్‌కుమార్, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ పాల్గొన్నారు.

16న కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర టెలీ కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ చౌహాన్ ఈ నెల 16న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో రాత్రి 8.15 గంటలకు విశాఖ చేరుకుంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 17న సాలిగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్స్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం 5.45 గంటలకు ఢిల్లీ బయలుదేరుతారు.

పొత్తులో సీటు ఫట్!

- తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనని జనసేన, టీడీపీ నేతల్లో ఆందోళన
- రాజకీయ భవిష్యత్‌పై ఆశావహుల అంతర్మథనం
- పెందుర్తిలో పంచకర్ల ఆశలకు పంక్చర్
- భీమిలి, ఉత్తర, పశ్చిమ, యలమంచిలి.. అన్నింట్లోనూ అదే పరిస్థితి
- నియోజకవర్గ స్థాయిలో పొత్తు పొడుపు కష్టమే...!



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుంది అటు జనసేన, ఇటు టీడీపీ నేతల పరిస్థితి. టీడీపీతో జత కడతామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో తమ సీట్లకు ఎక్కడ ఎసరు వస్తుందోనన్న ఆందోళన ఇరు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతోంది. తొలి నుంచి పార్టీలో ఉండటంతో పాటు గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన అభ్యర్థులు.. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తుతో తమ సీటు గల్లంతవుతుందని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పొత్తులో ఏయే సీట్లను కేటాయిస్తారో... అందులో తమ సీటు ఎక్కడ ఉంటుందోనని టీడీపీ నేతల్లోనూ గుబులు మొదలైంది. ప్రధానంగా పెందుర్తి, భీమిలి, విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ, యలమంచిలి, చోడవరం, గాజువాక, పాయకరావుపేట వంటి నియోజకవర్గాల్లో అగమ్యగోచర పరిస్థితి నెలకొని ఉంది. తమకు సీటు కేటాయించని పక్షంలో తమ భవిష్యత్ ఏమిటో తేల్చుకుంటామనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అంతేకాకుండా సీటు ఆశించి తాజాగా జనసేనలో చేరిన అభ్యర్థుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఉన్న చోట ఉండకుండా... ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో తెలియని ఇటువంటి పార్టీలో ఎందుకు చేరామోనంటూ తలలపట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా పొత్తు ప్రకటన తర్వాత కేడర్‌లో ఉత్సాహం రావాల్సిన పరిస్థితి నుంచి దిక్కుతోచని దుస్థితికి తీసుకొచ్చారనే అభిప్రాయం ఇరు పార్టీ నేతల్లోనూ వ్యక్తమవుతోంది.

నియోజకవర్గాల వారీగా..!

ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ-జనసేన పొత్తులో సీట్లలో తకరారు ఏర్పడే పరిస్థితి నెలకొని ఉంది. పెందుర్తితో మొదలుకొని విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ, భీమిలి, గాజువాక, యలమంచిలి, చోడవరం, పాడేరు ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీల నుంచి సీట్లు ఆశిస్తున్న అభ్యర్థుల మధ్య విభేదాలు తలెత్తే పరిస్థితులున్నాయి. పైగా పొత్తు కోసం జనసేన నుంచి ప్రకటన రావడంతో తమకు ఇచ్చే సీట్ల సంఖ్య కూడా తక్కువే ఉంటుందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అయితే, టీడీపీ అవసరం కోసం అర్రులు చాస్తున్నందున.... తమ పార్టీకి సీట్లు తక్కువగా వస్తే తమ పరిస్థితి ఏమిటని టీడీపీ నేతలు సందిగ్ధంలో పడ్డారు. మొత్తంగా ఇరు పార్టీలకు చెందిన పరిస్థితిని నియోజకవర్గాల వారీగా గమనిస్తే..

- పెందుర్తి నియోజకవర్గం నుంచి ఇప్పటికే టీడీపీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ ఉన్నారు. అక్కడ సీటు ఆశించి జనసేనలో చేరిన పంచకర్ల రమేష్‌బాబు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెందుర్తి నుంచి పోటీ చేస్తానని కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన పంచకర్ల... ఇప్పుడు పైనుంచి వచ్చిన ఆదేశాలతో పొత్తును స్వాగతిస్తున్నట్టు ప్రకటించారు. అయినప్పటికీ పొత్తు కాస్తా తనకు ఎసరు పెట్టిందని అనుచరుల వద్ద వాపోతున్నట్టు తెలుస్తోంది.
- గాజువాక నుంచి తిరిగి కోన తాతారావు, తిప్పల రమణారెడ్డిలు జనసేన పార్టీ నుంచి సీటును ఆశిస్తున్నారు. ఇన్నాళ్లుగా ఉన్న తన పరిస్థితి ఏమిటని టీడీపీకి చెందిన పల్లా శ్రీనివాసరావు మండిపడుతున్నారు. నియోజకవర్గాన్ని వదులుకుంటే ఇక రాజకీయాల్లో పక్కకు తప్పుకోవాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని అనుచరుల వద్ద ప్రస్తావిస్తూ... గాజువాక సీటును వదులుకునేది లేదని చెబుతున్నట్టు సమాచారం. ఇదే జరిగితే జనసేన నేతలు టీడీపీకి సహకరించే పరిస్థితి ఉండదని తెలుస్తోంది.
- విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి గతంలో జనసేన నుంచి పోటీ చేసిన పసుపులేటి ఉషాకిరణ్... తనకు సీటు ఇవ్వకపోతే తన దారి తాను చూసుకునే పరిస్థితి ఉందని సమాచారం. ఇక్కడ టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు.
- విశాఖ దక్షిణ నుంచి మూగి శ్రీనివాస్, బీశెట్టి వసంతలక్ష్మితో పాటు తాజాగా ఆ పార్టీలో చేరిన కార్పొరేటర్ కందుల నాగరాజు సీటు ఆశిస్తున్నారు. ఇప్పుడు పొత్తులో ఈ సీటు కాస్తా టీడీపీకి వెళితే తమ పరిస్థితి ఏమిటంటూ వాపోతున్నారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా గండి బాబ్జీ వ్యవహరిస్తున్నారు.
- గతంలో జనసేన నుంచి భీమిలిలో పోటీచేసిన పంచకర్ల సందీప్ సీటు తనకేనని ప్రకటించుకుంటున్నారు. ఇక్కడ ఏ పార్టీకి సీటు వచ్చినా.. ఇరు పార్టీల అభ్యర్థులు సహకరించుకునే పరిస్థితి లేదు.
- విశాఖ పశ్చిమలో జనసేన నుంచి పీలా రామకృష్ణ సీటు ఆశించి పార్టీలో పనిచేస్తున్నారు. ఇది టీడీపీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే సీటు కావడంతో జనసేనకు హ్యాండ్ ఇస్తారని తెలుస్తోంది.
- విశాఖ తూర్పులో జనసేన నుంచి బొలిశెట్టి సత్యనారాయణ సీటు ఆశిస్తున్నారు. టీవీ చర్చల్లో ఎంత వాదించినా... పొత్తులో తన సీటు గోవిందా అని భోరుమంటున్నారు.
- ఇక గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన పీవీఎస్ఎన్ రాజు (చోడవరం), అనకాపల్లి నుంచి పోటీ చేసిన పరుచూరి భాస్కరరావు పొత్తులో తమ సీటు ఏమవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.
- యలమంచిలిలో జనసేన నుంచి సుందరపు విజయ్‌కుమార్‌కు సీటు కేటాయిస్తే... టీడీపీ నుంచి సీటు ఆశిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు.
- పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన తరపున పనిచేస్తున్న శివదత్‌కు మొండిచేయి చూపించేలా ఉంది. అదేవిధంగా అరకు నియోజకవర్గం నుంచి సాయిబాబా, పాడేరు నుంచి గంగులయ్య, పద్మలు కూడా జనసేన కోటాలో తమకు సీటు రాకపోతే తమ దారి తమదే అనే రీతిలో ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీ నేతల మధ్య సీట్ల కోసం పోటీ నెలకొంది. పైన ప్రకటించినంత సులభంగా నియోజకవర్గాల్లో పొత్తు నెలకొనే పరిస్థితి లేదని ఇరు పార్టీల నేతలే ప్రకటిస్తుండటం గమనార్హం.

ఉత్సాహంగా సైక్లథాన్



జెండా ఊపి సైక్లథాన్‌ను ప్రారంభిస్తున్న సన్యాసిరావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ ఆధ్వర్యంలో ఎకో వైజాగ్ టీం గురువారం నిర్వహించిన ఇండియన్ స్వచ్ఛత లీగ్ సైక్లథాన్ ఉత్సాహంగా సాగింది. ఆర్కే బీచ్ నుంచి రుషికొండ వరకు సాగిన ఈ సైక్లథాన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ చేపడుతున్న ఏకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ నిర్మూలన తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా బస్ స్టేషన్ మీదుగా కాకినాడ వైపు బస్సుల పోక

డాబాగార్డెన్స్: విశాఖ నుంచి కాకినాడ సెక్టార్ బస్సులు మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో బయలుదేరి.. ద్వారకా బస్‌స్టేషన్ మీదుగా ప్రయాణించనున్నాయి. ప్రయాణికుల కోరిక మేరకు శుక్రవారం నుంచి ఈ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ప్రకటనలో తెలిపారు. కాకినాడ సెక్టార్ బస్సులకు ద్వారకా బస్టేషన్‌లో పికప్ పాయింట్ ఇచ్చామన్నారు. మద్దిలపాలెం బస్‌స్టేషన్‌లో బస్సులు బయలుదేరి, ద్వారకా బస్‌స్టేషన్, గురుద్వారా, ఎన్ఏడీ మీదుగా కాకినాడ, అమలాపురం, భీమవరం, రాజోలు వెళ్తాయన్నారు. కాకినాడ, అమలాపురం, భీమవరం, రాజోలు నుంచి వచ్చే బస్సులు ఎన్ఏడీ, గురుద్వారా మీదుగా నేరుగా మద్దిలపాలెం బస్ స్టేషన్‌కు వెళ్తాయని చెప్పారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని ఆయన కోరారు.

ప్రశాంత విశాఖే లక్ష్యం

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, గంజాయి రవాణా నియంత్రణ, మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి
- శాఖలో అంతర్గత అంశాలు, సిబ్బంది సంక్షేమానికి చర్యలు
- సీఎం దృష్టికి జాయింట్ కమిషనర్, అదనపు సిబ్బంది కేటాయింపు అంశం
- నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవిశంకర్ అయ్యనార్



బాధ్యతలు స్వీకరిస్తున్న రవిశంకర్ అయ్యనార్

దొండపర్తి: అందరి సహకారంతో ప్రశాంత విశాఖే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ అన్నారు. విశాఖ నూతన పోలీస్ కమిషనర్‌గా గురువారం ఉదయం 11.15 గంటలకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీపీగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ నుంచి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల ఏడీజీగా పని చేయడంతో విశాఖలో పరిస్థితులపై అవగాహన ఉందన్నారు. నగరంలో టాఫిక్ క్రమబద్ధీకరణ, గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తానన్నారు. పర్యాటక రాజధానిగా గుర్తింపు పొందిన విశాఖకు అధిక సంఖ్యలో దేశ, విదేశీ పర్యాటకులు వస్తుంటారని, వారి భద్రతకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. శాఖలో అంతర్గత అంశాలపైనే కాకుండా సిబ్బంది సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలు చేపడతానని వివరించారు.

సీఎం దృష్టికి అదనపు సిబ్బంది అంశం

రాష్ట్రంలో విశాఖ కీలక నగరంగా అభివృద్ధి చెందుతుండడంతో పాటు పరిపాలన రాజధానిగా ప్రభుత్వం చేయాలని భావిస్తుండడంతో భవిష్యత్‌లో అదనపు సిబ్బంది అవసరం ఉంటుందని వివరించారు. అందుకు తగ్గట్టుగా ఖాళీగా ఉన్న జాయింట్ కమిషనర్ పోస్టుతో పాటు అదనపు సిబ్బంది కేటాయింపు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. విశాఖ కమిషనరేట్‌ను ఏడీజీ స్థాయికి పెంచారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. రాష్ట్రంలో విశాఖకు ప్రాధాన్యం బాగా పెరిగిందని.. త్వరలో ఎన్నికలు, పరిపాలన రాజధాని అంశాలను దృష్టిలో పెట్టుకుని విశాఖకు ఏడీజీ స్థాయి అధికారి అవసరమని ప్రభుత్వం భావించడం కారణంగానే తనను ఇక్కడకు పంపించి ఉంటుందని ఆయన బదులిచ్చారు. కీలకమైన ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ శాఖల్లో పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రతి అంశంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందని, దానికి అనుగుణంగా విశాఖ ప్రజల భద్రతకు, ప్రశాంత జీవనానికి చర్యలు తీసుకుంటానన్నారు. అందుకు ప్రజలు, రాజకీయ నేతలు, అన్ని వర్గాల నుంచి సహకారం అవసరమన్నారు.

పలు విభాగాల సందర్శన

దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ కమిషనరేట్‌లో పలు విభాగాలు, కార్యాలయాలను సందర్శించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలోని డీసీపీ(క్రైం), ఏడీసీపీ(క్రైం), ఏడీసీపీ(ట్రాఫిక్), ఏసీపీ(ఏఆర్1, 2) కార్యాలయాలను పరిశీలించారు. బాంబ్ స్క్వాడ్, బీడీ టీఎం, ఆర్మ్‌డ్ రిజర్వ్ డ్యూటీ ఆఫీసర్ కార్యాలయం, బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లను సందర్శించి ఆయా అధికారులు, సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. పోలీస్ సబ్సిడరీ క్యాంటీన్, సీసీఆర్‌బీ, ఐటీ కోర్, కమ్యూనికేషన్ భవనం, పోలీస్ రీజినల్ హాస్పిటల్, మెన్ హోం, పోలీస్ గ్రౌండ్స్, బాస్కెట్ బాల్ గ్రౌండ్, ఎంటీ ఆఫీస్, ఫాల్కన్ వాహనం ఇతర నగర పోలీస్ శాఖకు సంబంధించిన కార్యాలయాలను సందర్శించి వాటి పనితీరును తెలుసుకున్నారు. డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్

నేటి నుంచి శాస్త్రీయ నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవాలు కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నుంచి జరగనున్నాయని ఫెస్టివల్ డైరెక్టర్, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్‌కుమార్ గౌడ్ తెలిపారు. తొలిరోజు సాయంత్రం 6.30 గంటలకు ఢిల్లీకి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత నళిని, కమలిని కథక్ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం ఏపీకి చెందిన నాట్యశ్రీ అవార్డు గ్రహీత గీతా నారాయణ్ కూచిపూడి నృత్యం, తమిళనాడుకు చెందిన ఆచార్య చూడామణి రోజా కన్నన్ బృందం భరతనాట్యం, యూఏఈకి చెందిన తెన్నేటి శ్రావణి కూచిపూడి నృత్యం, కేరళకు చెందిన ముద్ర కళా గురుకులం వారితో మోహినీ యాట్టం ప్రదర్శనలు ఉంటాయన్నారు.



బత్తిన విక్రమ్ గౌడ్

అప్పారావు కుటుంబానికి అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి



అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

సబ్బవరం: జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు అందించిన సేవలను పార్టీ గుర్తించుకుంటుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తుంపాల అప్పారావు కుటుంబ సభ్యులను గురువారం మర్రిపాలెంలోని వారి నివాసంలో పరామర్శించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ, పెందుర్తి నియోజకవర్గ పరిశీలకురాలు వరుదు కల్యాణితో కలిసి అప్పారావు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి అప్పారావు కొనసాగుతూ.. పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని సుబ్బారెడ్డి దృష్టికి ఎమ్మెల్యే అదీప్ రాజ్ తీసుకెళ్లారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కోటాన రాము, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల కన్వీనర్ కర్రిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, జేసీఎస్ మండల కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సీనియర్ నాయకులు బోకం రాము నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది ధృతరాష్ట్రుడి కౌగిలి

- టీడీపీని బతికించేందుకు జన సైనికులను మోసం చేస్తున్న పవన్ కల్యాణ్
- టీడీపీ, జనసేన పొత్తు.. కొత్త సీసాలో పాత సారాయి లాంటిది
- వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి రాజీవ్ గాంధీ ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ

సాక్షి, విశాఖపట్నం: టీడీపీ, జనసేన పొత్తు.. కొత్త సీసాలో పాత సారాయి వంటిదేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ విమర్శించారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుతో పొత్తు అంటే ధృతరాష్ట్రుడి కౌగిలి లాంటిదేనని.. దొరికితే భూస్థాపితమే తప్ప ఎదుగుదల ఉండదన్నారు. టీడీపీని బతికించడానికి నిన్ను నమ్ముకున్న జన సైనికులను మోసం చేస్తున్నావని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌పై మండిపడ్డారు. మీ అన్నయ్య చిరంజీవిని పార్టీ పెట్టిన సమయంలో క్షోభకు గురిచేసి.. మీ తల్లిని అవమానించిన వారి కోసం ఇప్పుడు ఎందుకంత ఆరాటం అని పవన్‌ను ప్రశ్నించారు. సీనియర్ కాపు నేత ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబాన్ని అరెస్ట్ చేసి హింసించినప్పుడు ప్రత్యేక విమానంలో వచ్చి పరామర్శించి ఉంటే ప్రజలంతా జై కొట్టేవారని.. అవినీతి ఆరోపణలపై జైలుకెళ్లిన చంద్రబాబు కోసం నీ తాపత్రయం చూసి ఛీ కొడుతున్నారన్నారు. జైలులో ములాఖత్‌కు వెళ్లి.. ప్యాకేజీ సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు ఉందని ఆరోపించారు. మీరు ఎంతమంది కలిసి వచ్చినా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్ గానే పోటీకి వస్తారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు జైల్లో ఉంటే టీడీపీని నడిపించే వారు సులెవరా? అని ఆ పార్టీ కేడర్ అంతా ఎదురు చూస్తోందన్నారు. ఒకవైపు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్.. మరోవైపు సొంతపుత్రుడు లోకేష్.. ఇంకోవైపు బావమరిది బాలయ్య.. టీడీపీ పగ్గాల కోసం మూడు ముక్కలాట జరుగుతోందని ఆరోపించారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి సీఎం పదవిని లాక్కొన్నప్పుడు భువనేశ్వరి పరిస్థితిలా.. నారా బ్రాహ్మిణి పరిస్థితి తయారైందన్నారు. అప్పుడు తండ్రిని కాదని భర్తకు భువనేశ్వరి మద్దతు పలికితే.. ఇప్పుడు ఆమె కోడలు భర్తను కాదని తండ్రికి మద్దతు పలికేలా ఉందన్నారు.

ఎంతమంది కలిసి వచ్చినా..

ప్రజల మద్దతు మాకే

వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసొచ్చినా.. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతు తమకేనని వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన పొత్తని పవన్ కల్యాణ్ చెప్తున్నా.. కేవలం చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మధురవాడ ఐటీ జంక్షన్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్కిల్ స్కాంలో పక్కాగా ఆధారాలతో దొరికితే కక్షపూరితంగా అరెస్ట్ చేశారని ఎలా చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్‌తో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల్లో అభద్రతా భావం కలిగే పరిస్థితి ఉంటుందనే.. ఆ పార్టీకి బలంగా ఉండాలనే పవన్ కల్యాణ్‌తో పొత్తు ప్రకటన చేయించారన్నారు. టీడీపీ, జనసేన పొత్తు ఇప్పటిది కాదని.. 2014 నాటి నుంచి ఉందన్నారు. 2019 ఎన్నికల్లోనూ ముసుగులో ప్రేమాయణం నడిపారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీలో లోకేష్ నాయకత్వానికి గతి లేక.. అత్యవసరంగా పవన్ చేత పొత్తు ప్రకటన చేయించినట్లుగా స్పష్టమవుతోందన్నారు. ఒకవైపు బీజేపీ వ్యతిరేక 'ఇండియా' గ్రూప్ పార్టీల మద్దతు పొందుతూ.. మరోవైపు బీజేపీ కూడా వస్తుందని పవన్ ఆశించడం కన్ఫ్యూజన్‌గా ఉందన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

శిబిరం చిరునామా
రవీంద్రభారతి స్కూల్,
ద్వారకానగర్ ఫస్ట్ లైన్, విశాఖపట్నం
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబరు : 70757 09205

ఇంటింటికీ ఆరోగ్య రక్ష

- నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష ' సర్వే
- 30 నుంచి ఆరోగ్య శిబిరాలు



మహారాణిపేట: ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న సర్వేలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు .. పట్టణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, నర్సింగ్ విద్యార్థులు, వలంటీర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు కలిసి ప్రతి ఇంటిని సందర్శిస్తారు. ఈ సర్వేలో రోగులను గుర్తించిన అనంతరం వారికి శిబిరం ఎక్కడ జరుగుతుందో తెలియజేస్తారు.

కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు

జిల్లాలో ఈ కార్యక్రమం అమలు కోసం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.రాజేష్ తదితరులు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారు. జిల్లాలో 542 మంది ఏఎన్ఎంలు, 909 మంది ఆశ వర్కర్లు, 9 నర్సింగ్ కాలేజీల నుంచి 598 మంది నర్సింగ్ విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. సర్వేలో వైద్యసిబ్బంది ప్రతీ ఇంటినీ సందర్శించి మ్యాపింగ్ చేస్తారు. ఏ ఇంట్లో ఎవరు ఎలాంటి ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారో గుర్తిస్తారు. గ్రామాల్లోను, పట్టణాల్లో నిర్వహించే హెల్త్ క్యాంప్‌ల ద్వారా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు మందులు, కళ్లద్దాలు అందజేస్తారు. క్యాన్సర్, కిడ్నీ తదితర దీర్ఘకాలిక వ్యాధుల బాధితులను గుర్తించడం, వారికి రెగ్యులర్ చెకప్ చేయడం, డాక్టర్లు ఎప్పటికప్పుడు పరిశీలించడం, మందులు అందించడంతో పాటు అవసరమైతే ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి మందులు అందిస్తారు.

ఆరోగ్యశ్రీ పై అవగాహన

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంపై అందరికీ అవగాహన కల్పిస్తారు. నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎక్కడ ఉన్నాయి? ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఆస్పత్రులకు ఎలా వెళ్లాలి, ఉచిత వైద్యసేవలు ఎలా వినియోగించుకోవాలనే అంశాలను తెలియజేస్తారు.

విద్యార్థులకు కంటి పరీక్షలకు ఏర్పాట్లు

జగనన్న ఆరోగ్య సురక్షలో పిల్లల కంటి సమస్యలను కూడా గుర్తించనున్నారు. జిల్లాలోని 1810 పాఠశాలల్లో చదువుతున్న 3 లక్షల 69 వేల 96 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

30 నుంచి వైద్య శిబిరాలు

ఈ నెల 30 నుంచి జరిగే వైద్య శిబిరాలకు అవసరమైన వైద్యులను నియమిస్తున్నట్లు ఏపీ వైద్యవిధాన పరిషత్ సమన్వయాధికారి డాక్టర్ రమేష్‌కిశోర్ తెలిపారు. అర్బన్‌లో 54, రూరల్‌లో 64 వైద్య శిబిరాలను నిర్వహిస్తామని, ప్రతీ శిబిరంలో నలుగురు వైద్యులు పాల్గొంటారని చెప్పారు. ఇందులో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, మరో ఇద్దరు స్పెషలిస్టులు (గైనిక్, పిల్లల వైద్యులు) శిబిరంలో పాల్గొనే విధంగా చర్యలు చేపట్టామని వివరించారు.

చంద్రబాబు కోసం ఎందుకంత తాపత్రయం పవన్?

గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: స్కిల్ స్కాంలో కోట్లాది రూపాయలు దోచుకున్న చంద్రబాబు జైలుకు వెళితే ప్రజలంతా సంతోషంగా ఉన్నారని.. కానీ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాత్రం చంద్రబాబు కోసం పరితపించిపోతున్నాడని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆరోపించారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతిపరుడి కోసం పరితపించే బదులు గాజువాకలో నీకు ఓట్లు వేసిన జనసైనికుల కోసం ఆలోచన చేస్తే భవిష్యత్ ఉంటుందని పవన్‌కల్యాణ్‌కు హితవు పలికారు. ప్యాకేజీలకే తప్ప రాజకీయాలకు పవన్ పనిచేయడని ఎద్దేవా చేశారు. జనసేనను ఎందుకు స్థాపించావో తెలియదు.. ఎప్పుడూ టీడీపీని ఎలా కాపాడాలి.. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను ఎలా చదవాలి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై దుర్భాషలాడాలనే తాపత్రయం తప్పితే.. ఏనాడైనా ప్రజా సమస్యల కోసం పోరాడావా.? అని పవన్‌ను ప్రశ్నించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనే నీకు ఓట్లు వేసిన గాజువాక, భీమవరం ప్రజల కోసం కనీసం ఆలోచన చేయలేదని మండిపడ్డారు. కాపులు, జన సైనికులను పవన్ టీడీపీకి తాకట్టు పెడుతున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇస్తే మళ్లీ గాజువాక నుంచి పోటీ చేయడానికి సిద్ధమని, గాజువాక నుంచి పవన్‌కల్యాణ్ పోటీ చేస్తే మరోసారి ఓడిస్తానని నాగిరెడ్డి అన్నారు. గాజువాక నియోజకవర్గంలో ఎన్నో సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు.

ఎక్స్‌లెన్స్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ట్రావెల్, టూరిజం రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు జిల్లా పర్యాటక సమాచార శాఖ తెలిపింది. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19వ తేదీలోపు www.aptourism.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

45 రోజుల శిశువుకు కంటి శస్త్ర చికిత్స



శిశువుకు ఇంజక్షన్ చేస్తున్న వైద్యుడు కృష్ణతేజ

సింహాచలం: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్‌లో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. 45రోజులున్న పసికందుకు కంటికి శస్త్ర చికిత్స నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరానికి చెందిన అలేఖ్య 1006 గ్రాములతో మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువుకు శ్వాసకోశ వ్యాధితోపాటు సెప్టిసిమియాతో కంటి సమస్య ఏర్పడింది. దీంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు కృష్ణతేజ ఆ పసికందుకు చికిత్స చేశారు. శిశువు అంధత్వాన్ని పూర్తిగా నివారించారు. వీలైనంత త్వరగా చికిత్స చేయకపోతే పూర్తి అంధత్వానికి గురయ్యే ప్రమాదం ఉండేదని డాక్టర్ కృష్ణతేజ చెప్పారు.

గోల్డ్‌బాండ్ రూపంలో అమ్మవారి బంగారం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన బంగారు వస్తువుల్లో నిరుపయోగంగా ఉన్న వాటిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గోల్డ్ బాండ్ రూపంలో డిపాజిట్ చేసేందుకు అధికారులు అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు, దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ అప్రైజ్ చేసిన అనంతరం 7 కేజీల 750 గ్రాముల బంగారాన్ని గురువారం బ్యాంక్ మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, దేవదాయ ధర్మదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎంవీ సురేష్ బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ ఎ.భవాని, గోల్డ్‌స్మిత్ పి.శ్రీనివాస్, ఎస్‌బీఐ మేనేజర్ ఎస్.సందీప్, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- అభినందన





విశాఖ నూతన పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవిశంకర్ అయ్యన్నార్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న పూర్వ సీపీ త్రివిక్రమ్ వర్మ, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

బాధిత కుటుంబానికి రూ.4లక్షల పరిహారం



తులసీరాం(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఫ్యాబ్రికేషన్ వర్క్ చేస్తూ విద్యుత్ షాక్ తగిలి కార్మికుడు మృతి చెందాడు. ఆటోనగర్ డీ-బ్లాక్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. ఆటోనగర్‌లోని ప్లాట్ నంబర్ 17లోని సాయి వెంకటేశ్వర ఇండస్ట్రీలోని ఖాళీ స్థలంలో గురువారం ముదావత్ తులసీరాం(33) అనే కార్మికుడు ఫ్యాబ్రికేషన్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ గురై పడిపోయాడు. ఇది గమనించిన తోటి వర్కర్లు అతన్ని గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తులసీరాం మరణించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతనికి భార్య దేవికా ప్రసన్న, పాప, బాబు ఉన్నారు. కాగా.. తులసీరాం భెల్ (హెచ్‌పీవీపీ)లో క్యాజువల్ ఉద్యోగి(వెల్డర్) అని, ఎక్కడ పనులు ఉంటే అక్కడకు వెళ్తుంటాడని తోటి కార్మికులు తెలిపారు. సాయి వెంకటేశ్వర ఇండస్ట్రీలో విద్యుత్ వ్యవస్థలో నిర్లక్ష్యం వల్ల అతను చనిపోయాడని భెల్ (హెచ్‌పీవీపీ) సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై స్పందించిన ఫ్యాక్టరీ యజమాని తులసీరాం కుటుంబానికి రూ.4 లక్షల నష్ట పరిహారం అందించడంతో పాటు అతని ఇద్దరి పిల్లల చదువు బాధ్యతను తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

బీసీలు, దళితుల రాజ్యాధికారం దిశగా అడుగులు

డా. కె.ఎ.పాల్



మీడియా సమావేశంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు డా. కె.ఎ.పాల్

సీతమ్మధార: బీసీలు, దళితులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డా. కె.ఎ.పాల్ పిలుపునిచ్చారు. గురువారం ఆశీలమెట్టలోని కె.ఎ.పాల్ ఫంక్షన్ హాలులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు ఫంక్షన్ హాలు ఆవరణలో ప్రార్థన చేసి అందరికీ నూనె అందజేస్తామని తెలిపారు. తాను విశాఖ ఎంపీగా పోటీ చేస్తానని, తనను గెలిపిస్తే ఉచిత విద్య, వైద్యం, రాష్ట్ర అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మణిపూర్‌లో ఊచకోతలు జరుగుతున్నా ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రధాని తలచుకుంటే చంద్రబాబుకు బెయిల్ వస్తుందన్నారు. టీడీపీ జెండా మోస్తున్న పవన్ కల్యాణ్‌కి ప్రజలు ఓట్లు వేయరన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్స్ పాల్గొన్నారు.


పట్టుదలతో కృషి చేస్తే ఉత్తమ ఫలితాలు

కొమ్మాది: పట్టుదలతో కృషి చేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ విజయకృష్ణన్(ఐఏఎస్) అన్నారు. గురువారం రుషికొండలోని బీఆర్ అంబేడ్కర్ ఏపీ స్టడీ సర్కిల్ భవన్‌లో సివిల్ సర్వీసెస్ మూడో బ్యాచ్ శిక్షణను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇక్కడి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలన్నారు. మూడో బ్యాచ్ కోచింగ్‌కు 102 మంది ఎంపిక కాగా.. ప్రస్తుతం 62 మంది హాజరయ్యారు.

సివిల్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి

పరవాడ: లంకెలపాలెం వంతెన సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న సివిల్ ఇంజినీర్ గంటి శ్రీనివాసరావు(54) మృతి చెందాడు. పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం ప్రాంతానికి చెందిన గంటి శ్రీనివాసరావు స్నేహితుడు రుత్తల మంగరాజుతో కలిసి లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. ఇద్దరూ హైదరాబాద్‌లోని అనుకర్ ప్రాజెక్టులో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఫార్మాసిటీ సమీపంలో కంపెనీ చేపట్టిన ఓ ప్రాజెక్టు పనులు చూస్తున్నారు. బుధవారం సాయంత్రం లంకెలపాలెంలో ఉంటున్న గదిలో దుస్తులు ఉతుక్కొని భోజనం అనంతరం నిద్రపోయారు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో మంగరాజు బాత్‌రూంకు వెళ్లగా.. దుస్తులు లేకుండా శ్రీనివాసరావు పడి ఉండడాన్ని గమనించి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. తన భర్త మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, గుండె పోటుతో మరణించి ఉంటారని భావిస్తున్నామని పోలీసులకు మృతుడి భార్య శ్రీదేవి వివరించారు.

హిందీ భాష ప్రాచుర్యాన్ని తెలియజేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీవీఎస్ శర్మ

విశాఖ విద్య: హిందీ భాష ప్రాచుర్యాన్ని నేటి తరానికి చాటిచెప్పాలని ఎన్ఐవో చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వీవీఎస్ శర్మ అన్నారు. బీచ్‌రోడ్‌లో గల విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ ఆఫ్(ఐసీఏఆర్)- సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన కార్యాలయంలో హిందీ దివస్ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డాక్టర్ శర్మ మాట్లాడుతూ దేశంలో హిందీ భాష ప్రాచుర్యం రోజు రోజుకు పెరుగుతుందన్నారు. సంస్థ ప్రధాన ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్.ఎస్ రాజు మాట్లాడుతూ హిందీ వాడుకతో దేశంలోని ప్రజానీకం మధ్య సత్సంబంధాలను పెంచిందన్నారు. హిందీ దివస్ వారోత్సవాలను ఈ నెల 21 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ యు. శ్రీధర్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు జాతీయ స్థాయి రాజభాష పురస్కారం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ జాతీయ స్థాయిలో ఉత్తమ రాజభాష కీర్తి (ప్రథమ బహుమతి)ని అందుకుంది. హిందీ దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలోని పూణేలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధికార భాషా విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ కుమార్ మిశ్రా చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ఈ పురస్కారం అందుకున్నారు. సీ కేటగిరీలోని ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఒడిశా, అస్సాం, జమ్ము కాశ్మీర్ వంటి హిందీ మాట్లాడని రాష్ట్రాలకు చెందిన వారిలో ఆరో సారి రాజభాష కీర్తి పురస్కారం పొందటం గర్వకారణం. ఈ సందర్భంగా సీఎండీ భట్ ఉక్కు ఉద్యోగులను అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు బైక్ యాత్ర



బైక్ యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సీపీఎం, ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ సంయుక్తంగా ఈ నెల 20 నుంచి 29 వరకు బైక్ యాత్ర చేపట్టనున్నాయి. ఈ మేరకు గురువారం సిటూ కార్యాలయంలో బైక్‌యాత్ర పోస్టర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిటూ నగర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాత్ర ఈ నెల 20న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమై మద్దిలపాలెం, మధురవాడ, భీమిలి మీదుగా ఆ రోజు రాత్రికి విజయనగరం చేరుకుంటుందన్నారు. దీనికి ఉపజాతాగా 21న మద్దిలపాలెంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమై 26 వరకు విశాఖపట్నం పార్లమెంట్ పరిధిని కవర్ చేస్తుందన్నారు.